

జిజ్ఞాస సప్తకం

ఆ ఏడుగురు అన్వేషకులను గురించి వినటం అదే ఆఖరుసారి నాకు. బహుశా ఎవరికైనా గూడా అదే చివరి సారి అనుకుంటాను.

ఈ కథను నాకు ఒక గోసాయి చెప్పాడు. గోసాయిలదంతా ఒక జాతి. ఆ జాతి ఇప్పుడు క్రమంగా క్షీణించి పోతోంది. వారు నిరంతర సంచారులు. ఒక్క చోటా స్థిరంగా ఉండరు. ఒక చోటునుంచి మరొక చోటుకు, ఒక గురువును వదలి మరొక గురువుదగ్గరకు పోతుంటారు. భక్తి విశ్వాసాలతో గురువును సేవించుతారు. గురువుచెప్పే ఆత్మకథలను, అనుభవాలను, ఆధ్యాత్మిక పాఠాలను శ్రద్ధతో వింటారు. కాని ఆ సన్యాసులు సాధించేది మాత్రం శూన్యం. వారికి పెద్ద కోరికలుండవు. ఉన్నచోటనే ఉండటం వాళ్ళకు ఇష్టం. వాళ్లు పెద్ద పెద్ద గడ్డాలను పెంచుతారు. కానీ వాళ్ళ మాటల తీరు, చేష్టల వైఖరి ఆడవాళ్ళలా ఉంటాయి.

కాషాయ గుడ్డలను కట్టుకున్న సాధు

కాజ సుబ్బారావు

లంబోదర్ అనే సన్యాసి ఆ ఏడుగురు వృద్ధ అన్వేషకులకు ఒకసారి తటస్థ పడ్డాడు. అతనే నాకీ కథ చెప్పాడు.

"సత్యాన్వేషణకు వారు పనికిరారని ఖచ్చితంగా చెప్పాను. వాళ్ళు వృద్ధ జంబుకాలు. చాలా గొడవ మనుష్యులు. కాకపోతే విచిత్రవ్యక్తులు. అభిలాష ఉంటే చాలదు. సంకల్ప దీక్ష కావాలి. నిజమైన అన్వేషణ కావాలి. వాళ్ళు క్లబ్బులకే అంకితమై గాలికబుర్లు చెప్పుకుంటూ త్రాగుతూ పేకాటఆడుతూ ఉండటమే మంచిది.

"కానీ వాళ్ళు వినలేదు. 'దయచేసి దైవ సాన్నిధ్యానికి దగ్గరి దారి చూపగల ఏ వ్యక్తినైనా మాకు పరిచయం చెయ్,' అని మొరపెట్టుకున్నారు.

"ఆ పప్పులేం ఉడకవు. అడ్డదార్ల వ్యాపారం నా దగ్గర పనికిరాదు" నిర్మొహమాటంగా చెప్పాను. "నేను కొంతమంది నిష్కళంకమైన ఆధ్యాత్మిక బోద్ధకులను ఎరుగున్నాను. వాళ్ళల్లో ఒక్కరైనా మిమ్ములను శిష్యులుగా స్వీకరించి ఉపదేశించుతారని నాకు నమ్మకంలేదు. అదీగాక ఆ గురువు మీకు అడ్డుదారి చూపిస్తాడో కంటకాకీర్ణ మార్గం చూపిస్తాడో ఆయన ఇష్టం మీలో ఒకరికి ఒక దోవ చూపవచ్చు మరొకరికి అందుకు భిన్నమైన మార్గం చూపించ వచ్చు," అన్నాను.

"ఎందుకని?" బిత్తరబోయి అడిగారు వాళ్ళు." ప్రతి విషయంలోను మేమంతా సమానార్హతలు యోగ్యతలు గలవారం. మేము రిటైరైన మొదటి తరగతి ఆఫీసర్లము."

నేను నవ్వి చివాట్లు పెట్టాను. "మీరేమైనా కావచ్చు. మీ మొదటి తరగతితో నిమిత్తంలేదు. మీరు వంద వక్రమార్గాలు తొక్కవచ్చు. లేదా మీ యోగ్యతవల్లనే పైకి రావచ్చు. అది నా కనవసరం. నేను లెక్కచేయను. మీ తెలివితేటలుగాని మీరు చెప్పుకొనే యోగ్యతలుగాని ' గురువుముందు మీ స్థాయిని పెంచలేవు. ఎవరి పూర్వజన్మ సుకృతాన్ని బట్టి వారికి మార్గాలు నిర్దేశింపబడతాయి. 'పూర్వ జన్మ సుకృతమంటే తెలుసా? జన్మ జన్మాంతరాల వల్ల ఆత్మ పొందిన సంస్కృతి. మీలో ఒకరికి ఒక యేడాదిపాటు ఆధ్యాత్మిక గ్రంథాలను చదవమని ఆదేశించవచ్చు గురువుగారు. మరొకర్ని ఒక పుష్కరకాలం తన కాళ్ళను పిసుకుతూ గోవులను కాస్తూ ఉండమని శాసించవచ్చు. ఆధ్యాత్మిక గ్రంథాలను చదివేవాడు రెండోవాని కంటె మిన్న అని అనుకోరాదు."

నేను చెప్పింది వాళ్ళకు ఆశక్తి గలిగించినట్లుగాలేదు. వాళ్ళల్లో వాళ్ళు కూడబలుక్కొని నా చేతిలో ఒక వంద రూపాయల నోటును కుక్కారు. "తర్వాత ఇంకా ఇస్తాము. మాకు ఏదో

ఒకటి చేసి చూపించగల ఏ వ్యక్తి దగ్గరకైనా తీసుకెళ్ళి పరిచయంచెయ్." ప్రాధేయపడ్డారు.

"ఏం చేయాలి మీ కోసం? ఏం చూపించాలి మీకు?" అడిగాను.

"ఏదైనా సరే. మన్నుకి అగ్ని గోళాన్ని మింగటం. లేదా తాడును పాముగా మార్చటం. కాదా శూన్యంలో నుంచి ఏదైనా వస్తువును సృష్టించటం.... నా నడుము నొప్పిని పోగొట్టటం లాంటివి "

"లేదా నా బట్టతలను "

"కాకపోతే నా దృష్టి . కాదు కాదు.. మా దృష్టిమాంద్యాన్ని...."

నాకు వాళ్ళమీద గల అభిప్రాయం పూర్తిగా మారిపోయింది. వాళ్ళకోరికలు వాళ్ళు చెప్పిన దైవాన్వేషణాది మాటలకు విరుద్ధంగా ఉన్నవి.

"చూడండి. మీ నడుం నొప్పివల్ల ప్రమాదం లేదు. కొన్ని వనమూలికలతో నేనే నయం చేయగలను. కానీ మీ బట్టతలను బ్రహ్మదేవుడు కూడా బాగు చేయలేడు వెయ్యి సంవత్సరాల క్రిందట వ్రాసిన ఒకానొక వైద్య గ్రంథంలో ఇలా ఉంది: ఒక ఔన్సు మొసలి క్రొవ్వుకు నీటిగుర్రపుక్రొవ్వు ఒక ఔన్సు చేర్చి తాబేటిబొచ్చెలో కలిపి బాగా కలియబెట్టాలి. ఆ మిశ్రమాన్ని పద కొండు సంవత్సరాల పదకొండునెలల పదకొండు రోజులు మీ బట్టతలకేసి బాగా మర్దించాలి. అప్పుడు మీ తలమీదబొచ్చు ఆ మూడు జంతువులమీద మొల్చినట్లుగా విస్తారంగా పెరుగుతుంది . సరే, మిమ్మల్ని ఒక వ్యక్తి దగ్గరకు తీసుకెళ్తాను. ఆయన దృష్టి లోపాన్ని బాగు చేయటమేగాక మీ కళ్ళకు ఒక విచిత్ర మైన చూపునిస్తాడు."

"విచిత్రమైన చూపంటే?"

"నిజానికి ఒకటిగాదు. అనేకరకాలైన వింత శక్తులన్నమాట. వాటిల్లో మీకు ఏది కావాలో కోరుకోండి. ఉదాహరణకు ఆయన మీకు కాసిని నీళ్ళు ఇస్తాడు. ఆ నీటిని మీ కళ్ళల్లో వేసుకుంటే మీకు భయమనేది ఉండదు పులి పిల్లిపిల్లగా కనబడుతుంది. రాక్షసి వినయవిధేయతలు గల బానిసగా కనబడుతుంది. మరొక రకమైన నీటితో మీ కళ్ళను పరిశుభ్రం చేస్తాడు. అప్పుడు ప్రపంచమంతా ఎంతో అందంగా కనబడుతుంది. అప్పుడు మీరు పంది పెదవులను ముద్దాడగలరు. ఒక పిశాచంతో ఒకే పక్కమీదపడుకోగలరు. ఇంకొక రకమైన నీటితో మరికొన్ని వింతలు చూడగలరు "

"ఎలా?"

"నేను చెప్పకుండా ఉండటమే మంచిది. మీరంతా గొప్పవారు. మంచి సంస్కృతి గలవారు. అలాంటి తుచ్ఛ వాంఛలను అనుభవించాలని కోరరు."

"ఏమైనా సరే. మేము వినితీరాలి "

"మీరు వినాలని అంతగా కుతూహల

పడుతుంటే చెప్తాను. వినండి. ఒకరకమైన నీటిని మీ కళ్ళల్లో వేసుకుంటే స్త్రీ పురుషులు ఎంత మంచి దుస్తులు ధరించి ఉన్నా దిగంబరులుగా కనబడతారు."

"దేవా, దేవా, దేవా!"

"ఇందులో దేవుడికి ఎలాంటి సంబంధము లేదని మీరు ముఖ్యంగా గమనించాలి. నిజంగా మీకు భగవంతుని మీద భక్తీ, అన్వేషణాసక్తి ఉంటే మిమ్మలను మరొక "

"దేవుడియందు మాకు అసక్తి వుంది. ఈ వయస్సులో మేము కోరుకునేది మరేముంది? కానీ, మొదటిమెట్టుగా నీవు చెప్పే వ్యక్తిని మేము కలుసుకోవాలని వుంది ఆయన చేసే అద్భుత చర్యలు మా భక్తిని మరింత ఇనుమడింపచేస్తాయి. దేవునియందు గట్టి నమ్మకం ఏర్పడుతుంది మాకు "

"ఎన్నటికీకాదు. అద్భుతకృత్యాలు అద్భుతాలమీదనే నమ్మకం కలిగిస్తాయి. అదీగాక అవి మనిషిని తారుమారు చేస్తాయి. భ్రమింపచేస్తాయి. వాటిని అనుసరించిఉన్న అపాయాన్ని గుర్తించలేరు. ముఖ్యంగా భగవంతునిమీద భక్తి లేనివారు చేస్తుంటే అవి వక్రిస్తాయి. విశిష్టమైన సత్యాన్వేషకులు దేనినైనా ఆధారంగా పట్టుకొని ఉన్నత శిఖరాలను అందుకోగలరు. ఇది ఐహికులకు గూడా సాధ్యమే కానీ మీరంతా చిత్రమైన మనుష్యుల సముదాయం."

"బాగా అన్నావు. కానీ ఆ అద్భుత కార్యాలుచేసే వ్యక్తిని చూడాలనివుంది మాకు ఆయన దగ్గరకు తీసుకెళ్ళితే నీకెంతో ఋణపడి ఉంటాము. వినయ విధేయతలుగల సేవకులుగాఉంటాము." వాళ్ళు బాగా ఉద్రేకంగా ఉన్నారు. ఒక గంటసేపు నాతో వాదించారు.

నేను ఒప్పుకోక తప్పలేదు. నాకు చాల అర్జంటుగా డబ్బు కావలసిఉంది. అదీగాక హిడంబ బాబాను చూసి చాల కాలమైంది. ఆయన్ను కలుసుకోవాలని కొంతకాలం నుంచి అనుకుంటున్నాను. నేను ఇంకా నాలుగొందలు రూపాయలివ్వమన్నాను. పైకమంతా ఒక్కసారే ముందుగా ఇవ్వాలని గూడా కచ్చితంగా చెప్పాను. హిడంబ బాబాను చూచి ఆయన చేసే మాయలను కన్నులార గాంచిన తర్వాత ఇస్తామన్నారు.

"ఆ పప్పులేం ఉడకవు. ఇది వ్యాపారంగాదు. నన్ను నమ్మకపోతే పొండి," అన్నాను.

ఆ సాయంత్రమే అడిగిన డబ్బును నా చేతుల్లో పెట్టారు. తెల్లవారుఝామున 'ఉవుర్వా'కొండలకు మేంబయలుదేరాం ఆ కొండలమీద హిడంబబాబా నివాసం ఉంది ఆ మిత్ర బృందం ఆహారపొట్లాలను, మత్తు పానీయాల సీసాలను విరివిగా తెచ్చారు. నేను దారి చూపుతుంటే వారు ఒకరికొకరు మార్చుకుంటూ కారు నడుపుతున్నారు. దారి పొడుగునా సిద్ధులతో

నాకు గల పరిచయాలను కథలుగా చెప్పాను. వాళ్ల నిట్టూర్పులు విడిచి ఐహికవాంఛలతో కాలం వృథాపుచ్చినందుకు విచారించారు. పొంగి పొర్లి వస్తున్న నవ్వును బలవంతంగా ఆపుకున్నాను.

ఒక చిన్న వీధి చివర మేము భోజనాలను ముగించాం. కాసేపువిశ్రాంతి తీసుకొని, మళ్ళీ రోడ్డునపడ్డాం. దారంతా ముళ్ళపొదలతోను, రాళ్ళగుట్టలతోను నిండి వుంది. జాగ్రత్తగా నెమ్మదిగా ముందుకు సాగాం. హిడంబ బాబా ఆశ్రమానికి చేరుకునేసరికి సాయంత్రమయింది. బాబా ప్రక్కన ఇద్దరు శిష్యులు కూర్చున్నారు. ఆయన మా వంక తీక్షణంగా చూచారు. ఆయన కళ్లు అగ్ని గోళాలులా ఉన్నాయ్. చీకటి కన్నంలో నుంచి చూస్తున్న పాముకళ్ళల్లా మండిపోతున్నాయి. నేను ఆయన పాదాలమీద పడి నమస్కారం చేశాను. మిగతావారు గూడా నన్ను అనుసరించారు.

"ఈ వృద్ధ జంబుకాలెవరు?" అరిచారు బాబా.

"సమాజంలో వారు గొప్పవారైనప్పటికీ మీకు విశ్వాసపాత్రులైన కుక్కలు. మీ పాదధూళికోసం ఇంత దూరం వచ్చారు. కనికరించండి, బాబాజీ. మీ కరుణాకటాక్షవీక్షణాలతో వాళ్లను పునీతులను చేయమని వేడుకొంటున్నాను," అన్నాను.

"ముందు వాళ్లను కాలువలో స్నానం చేయమని చెప్పు. ఇక్కడనుంచి వెంటనే తీసుకెళ్ళు, తప్పుడు గాడిద కొడకా."

మిత్ర బృందం భయంతో వణికి

పోయారు. వాళ్లకు ధైర్యం చెప్పి బాబా అన్న మాటలను లెక్కచేయవద్దన్నాను. మనమీద వాత్సల్యంతోనే ఆయన అలా మాట్లాడారు అన్నాను.

బాబా వారి ప్రత్యక్ష ఆధ్వర్యంలో మేము తృప్తిగా భోజనం చేశాం ఆ కాసేపట్లోనే బాబా శక్తిసామర్థ్యాలు వాళ్ళకు తెలిసివచ్చాయి. బాబా ఇచ్చిన పరిశుద్ధమైన వేడి వేడి పాలను తాగుతూ వాళ్ళు సంబరాలుపడ్డారు. ఎంతో రుచిగా వున్నవని సంతోషించారు. మరుక్షణంలో ఆ పాలు విషమయమయ్యాయని వాంతి చేసుకున్నారు. చాలసేపటివరకు వాళ్లకు మాటరాలేదు తర్వాత బాబా పాదాలమీద పడి, "బాబాజీ! మీ మహిమలు అపారం. మీశక్తి అనంతం. ఇంకొక వింతను చేసి చూపండి," అన్నారు. "మా కళ్ళతో అత్యద్భుత రహస్యాలను తిలకించే మంత్రజలాలను మా కివ్వండి." అని ప్రాధేయపడ్డారు.

"అవును, బాబాజీ! వారి కోరిక తీర్చ మని వేడుకొంటున్నాను," అన్నాను.

"సరే. ఇప్పుడు మీకొక రకమైన నీటిని ఇస్తాను అది పుచ్చుకుంటే గాఢ నిద్రలో మునిగిపోతారు మీరు." అను గ్రహించారు బాబా.

"లేదా మంచి చూపును ప్రసాదించు, బాబాజీ," అన్నాను.

మిత్రబృందం క్షణం మౌనంగా కూర్చున్నారు. తర్వాత వారిలో ఒకరు ఇల్లా అన్నాడు. "బాబాజీ! మీరు ఉదారులు. ఇంకొక రకమైన నీళ్ళ సంగతేమిటి?"

"బాబాజీ! పెద్దపులి పిల్లిపిల్లలా కనబడే మంత్రజలాలను గూర్చి చెప్పాను," అన్నాను నేను.

"అలా ఎందుకు చెప్పావు?" అరిచాడు బాబా, అగ్నిగోళాల్లాంటి గుడ్లను తిప్పుతూ. కానీ ఆయనకు నా మీద నిజంగా కోపంలేదని నాకు తెలుసు.

"బాబాజీ! పురుగుల్లో పురుగు తమ అనుగ్రహం సంపాదించటానికి వంద తప్పులు చేస్తాడు," అన్నాను వినయంగా.

ఆ అన్వేషకులు తమలో తాము సంప్రదించుకున్నారు. ఆ తర్వాత వారిలో ఒకరు నన్ను చూస్తూ ఇలా అన్నాడు: "ఇంకొక రకమైన నీళ్ళను గురించి గూడా నీవు మాతో చెప్పలేదా?"

"చెప్పాను. ప్రపంచంలో ప్రతి వస్తువు అందంగా కనబడేట్లు చేయగల నీటిని గూర్చి గూడా చెప్పాను." అన్నాను.

అన్వేషకులు క్షణం నిశ్శబ్దం వహించారు. మరొకడు లేచి "మరొక రకమైన " ఏదో అనబోయాడు.

"జనమంతా దిగంబరులుగా కనబడే నీళ్ళు? పోకిరి వెధవల్లారా!" హిడంబ బాబా అరిచారు. ఈసారి నిజంగానే చీదరించుకున్నాడు

మిత్రబృందం చేతులు ముడుచుకొని

ఆ తిట్లను మౌనంగా భరించారు. వాళ్ల ప్రవర్తన గురించి నాకెలాంటి భ్రమలు లేకపోయినా వాళ్ళు అలా సిగ్గు ఎగ్గు లేకుండా అడగటంచూస్తే నాకే అసహ్యా మనిపించింది. ఆ వయస్సులో ఏ ప్రయోజనంలేని ఆ కోరిక గలిగినందుకు మిక్కిలి గర్హించాను.

"సరే. ఈ విధంగా నావల్ల లాభం పొందదల్చారన్న మాట! ఈ అడ్డగాడిద లంబోదర్‌ను చూచి అనుగ్రహిస్తున్నాను మీరు కోరిన నీళ్ళను ఇస్తాను. నాకేం ఇస్తారు?" అన్నారు హిడంబ బాబా.

వాళ్ళు మెల్లగాకూడబలుక్కున్నారు. కరెన్సీనోట్లకట్టను తీసి హిడంబ బాబా ముందుంచారు. బహుశా వెయ్యి రూపాయలు ఉండవచ్చు. వెంటనే బాబా ఒక సేవకుడ్ని పిలిచారు. వాడు ఒక చిన్న దయ్యంలా ఉన్నాడు. రహస్యంగా వాడికి కొన్ని సంకేతాలనిచ్చారు. వాడు మరుక్షణం మాయమై ఐదు నిమిషాల్లో ఒక చిన్న పసుపు పచ్చని సీసాతో తిరిగి వచ్చాడు

"ఈ సీసా తీసుకోండి. ఒక్కొక్క కంటిలో ఒక చుక్క కంటె ఎక్కువ వేసుకోకూడదు. మొదటి అయిదు నిమిషాల వరకు మీకేమీ కనబడదు. ఆ తర్వాత చూస్తారు. దాని మహిమ ఒక గంట మాత్రమే ఉంటుంది. రెండుబొట్లు వేసుకుంటే రెండు గంటలుంటుంది. కానీ రెండు చుక్కలకంటె ఎక్కువ వేసు కుండేరు, వెధవల్లారా?"

"వేసుకోం. మిగిలిన నీటిని మరొక సారి ఉపయోగిస్తాం."

"అలా పనిచేయదు. అది ఒకే ఒక సారి ఇప్పటినుండి ఇరవై నాలుగు గంటల్లోగా పనిచేస్తుంది. కావలసిన దాని కంటె కొంచెం ఎక్కువగా ఇచ్చాను. పొరపాటున వృథా అయితే భర్తిచేయ టానికి.... ఇకపొండి వెధవల్లారా! తెల్లవారితే మీ వెధవ ముఖాలను నేను చూడలేను."

వాళ్లల్లో ఇద్దరు ఆ రాత్రి కారులో సర్దుకొని నిద్రపోయారు. మిగతావారు దాపునున్న గుడిశలో పడుకున్నారు. అర్ధరాత్రిదాకా బాబాతో నా స్వంత విషయాలు మాట్లాడాను తెల్లవారక ముందే వాళ్ళను లేపి లువుర్వా కొండల నుంచి బయలుదేరాం.

"నిజంగా ఈ నీళ్ళు పనిచేస్తా యంటావా?" అడిగారు నన్ను దారిలో. పగటి వెలుగు వాళ్ళల్లో అనుమానాలను రేకెత్తించింది.

"ప్రయత్నించి చూడండి" అన్నాను ముభావంగా.

"ఇప్పుడా? నీ అందాన్ని నగ్నంగా చూడటానికా?" పగలబడి నవ్వారు.

"ఒక్కసారి కంటె పనిచేయదని బాబా చెప్పలేదా?" అన్నారు.

నేను మాట్లాడలేదు. నా మనస్సు

బాగాలదు. వీరి మూలంగా నా పాపాల పట్టీకి మరొక పాపాన్ని చేర్చాను. వీళ్ళను ఎంత త్వరగా వదిలించుకుంటే అంత మంచిదనుకున్నాను.

ఊరు ముందుకు చేరుకోగానే పక్కవీధిలో ఒక స్నేహితుడ్ని చూడటానికి దిగిపోతానన్నాను. అర్ధోక్తిలో వాళ్ళు ఒకరి ముఖం ఒకరు చూచుకున్నారు.

"అదేం కుదరదు అలా నిన్ను పోనివ్వం," అన్నారు. ఆ మాటలు, వాళ్ళు మాట్లాడిన తీరు చూసేసరికి నాకు కోపం వచ్చింది. "నేను దిగిపోవాలి." గట్టిగా అరిచాను. "కానీ మేము నిన్ను వదలం" అంటూ నా చేతులు గట్టిగా పట్టుకున్నారు. అనుమాన పిశాచపు నైత్యాన్ని దౌర్జన్యాన్ని అంత నగ్నంగా మున్నెన్నడూ చూడలేదు నేను.

మిగతా ప్రయాణం మౌనంగా సాగించాను. వాళ్ళు హాస్యంగా మాట్లాడి నన్ను శాంతపర్చటానికి ప్రయత్నించారు. కానీ నేను లొంగలేదు. మేము ఊళ్ళోకి చేరుకునేసరికి సాయింత్రమయింది.

వాళ్ళు నన్ను క్లబ్బుకు తీసుకెళ్ళి ఒక గదిలో పెట్టి తాళంవేశారు. రెండు గంటల తర్వాత తిరిగి వచ్చారు.

వాళ్ళు ఆనందంగా అమితోత్సాహంగా ఉన్నారు. అక్కడ నుంచి 'హోటల్ హసీ'కి కార్లో వెళ్ళాం. పుష్టుగా భోజనం చేసింతర్వాత పీకలవరకు వాళ్ళు తాగారు. "మన మంత్రాన్ని ఎప్పుడు ప్రయోగిద్దాం?" అన్నాడు ఒకడు.

"ఎప్పుడో ఎందుకు? ఇప్పుడే ఎందుకు కాకూడదు?" అన్నాడు మరొకడు. వెంటనే పసుపుపచ్చని సీసాతీసి నా ముందుంచారు. "ఆ నీళ్ళ చుక్కలను మా కళ్ళల్లో వెయ్," అని ఆజ్ఞాపించారు. నేను సమ్మతించలేదు. విముఖత చూపాను. మాట వినకపోతే కార్లో నన్ను కాలవదాకా తీసుకెళ్ళి బ్రిడ్జి మీదనుంచి నీళ్ళలోకి తోస్తామని బెదిరించారు. 'సరే' నంటూ లేచి ఒక్కొక్కరి కళ్ళల్లో రెండు రెండు బొట్లు వేశాను.

వాళ్ళు నిశ్చలంగా కూర్చున్నారు. కళ్ళను తెరవలేకుండా ఉన్నారు. అందులో ఒకడు పెనుగులాడి అతి కష్టంతో కళ్ళు తెర్చి వణుకుతున్న కంఠంతో ఉద్రేకంగా అరిచాడు "నిజం. అది నిజం" అని.

వెంటనే మిగతా వాళ్ళు కళ్ళు నులుముకొని రెప్పలు ఆడిస్తూ సంభ్రమాశ్చర్యాలతో అరిచారు.

"అంత తొందరెందుకు? మీ చూపు దెబ్బతినవచ్చు. కళ్ళు మూసుకొని అయిదు నిమిషాలు కూర్చోండి. ఏమైనా మీరు నరకకూపంలో ఒక గంట గడుపుతారు గదా!" అన్నాను.

"ఒక గంట కాలమే ఉండటం ఎంత దురదృష్టకరం?" విచారించాడు ఒకడు.



"ఒక గంట ఏం కర్మ? రెండు గంటలు అనుభవిద్దాం!" అన్నాడు మరొకడు. ఇంకోసారి ఆ నీటి బొట్లను వారి కళ్ళల్లో వేయమన్నారు నన్ను. నేను గొణుక్కుంటూ వాళ్ళు చెప్పినట్లు చేశాను.

"ఇంకా ఎన్ని నీళ్ళున్నాయి?" ఇంకొకడు అన్నాడు. "మరో రెండు చుక్కలను వేసుకుంటే మూడు గంటల దాకా పనిచేస్తుంది గదా. మిగిలిన నీళ్ళు తర్వాత ఎందుకూ పనికిరావని హిడంబ బాబా చెప్పలా?"

"కానీ నాలుగు బొట్లకంటే ఎక్కువ వాడకూడదని గూడా బాబా చెప్పారు." అన్నాను.

"ఫర్వాలేదు. మేం చెప్పినట్లు చెయ్. లేదా బ్రిడ్జి క్రింద నీరంతా నీదే!" అన్నారు.

"సరే. రండి" అంటూ లేచాను. వాళ్ళు ముసి ముసి నవ్వులు విసురుకున్నారు నన్ను చూసి వాళ్ళకు వింతగా కనబడి వుండవచ్చు నేను. సీసాలో మిగిలిన నీళ్ళను వాళ్ళ కళ్ళల్లో వేశాను. ఖాళీ సీసాను కిటికీలో నుంచి వీధిలోకి గిరాటేశాను వాళ్ళు కళ్ళు మూసుకొని నిశ్చలంగా కూర్చున్నారు.

నేను గదిలోనుంచి వీధిలోకి వెళ్ళాను. హోటల్ ముందు పచార్లు చేస్తూ వాళ్ళల్లో ఏవైనా మార్పులు వస్తాయేమోనని గమనిస్తున్నారు. మరు క్షణంలో ఒక పొలికేక నా గుండెల నుండి దూసుకెళ్ళింది. ఆ తర్వాత

గంద్రగోళంగా అరుపులు. వీధిలో వెళ్ళేజనం ఆగిపోయారు. వందల సంఖ్యలో హోటల్ ముందు గుమి గూడారు ఒకరి ముఖాలు ఒకరు చూచు కుంటున్నారు. అసలు ఏం జరిగిందో ఎవ్వరికీ తెలియదు.

సప్త స్నేహితుల్లో ఒకరు గుండె జబ్బు మనిషి. కుర్చీలో కూర్చున్నవాడు కూర్చున్నట్లే ప్రాణం విడిచాడు. ఇద్దరు మూర్ఛపోయారు. మిగతావారు గగ్గోలగా పారిపోవటానికి ప్రయత్ని స్తున్నారు. వాళ్ళ దగ్గరకు ఎవరు వెళ్ళినా తప్పించుకు పారిపోతున్నారు. చివరకు వాళ్ళు పట్టుబడ్డారు.

ఈ వింత సంఘటన గూర్చి పోలీసులు ఎంత ఆచూకి తీసినా ఫలితం లేకపోయింది. హోటల్లోని ఆహారాన్ని తినుబండారాలను మత్తుపదార్థాలను పరీక్షలు జరిపించారు. ఉపయోగం లేకపోయింది. ఈ సంఘటనతో నాకు సంబంధం ఉన్నట్లు ఎవరికీ తెలియకపోవటం నా అదృష్టం. మాకు సర్వు చేసిన వెయిటర్ నేనంటే పడిచస్తాడు. నా ఉనికి వాడు ఎవరితోను చెప్పలేదు.

కొంతసేపటికి జిజ్ఞాస సప్తకంలో చాలమంది పిచ్చి ఆసుపత్రిలో చేరారు. చివర వరకు తన కుమారుని వద్దే ఉన్న ఒక జిజ్ఞాసువు ఉలుకు పలుకు లేకుండా కూర్చున్నాడు.

తర్వాత అసలు రహస్యాన్ని హిడంబ బాబా నాకు చెప్పారు. మూడవ సారి వేయటంలో వారి దృష్టిలో గుణాధికమైన మార్పు వచ్చింది. వాళ్ళు కళ్ళు తెరచి చూచేసరికి దిగంబరులైన మానవులే గాక రక్తమాంసాలు లేని అస్థిపంజరాలను చూశారు. శతాధికమైన అస్థిపంజరాలు వాళ్ళ చుట్టూ నృత్యం చేస్తున్నాయి. భయంతో బిజారున పడ్డారు. అక్కడ కూడా అంతే. అస్థిపంజరాలు కార్లు నడుపుతున్నాయి. అస్థి పంజరాలు పత్రికలను విక్రయిస్తున్నాయి. తమను పట్టుకోడానికి అస్థిపంజరాలు వాళ్ళను చుట్టు ముట్టుతున్నాయి. అస్థిపంజరాలు పళ్ళుతెరచి ఇకిలిస్తున్నాయి.

లంబోదర్ కథ పూర్తిచేశాడు.

కొన్ని సంవత్సరాలు క్రిందట ఒక ఘోష్ హోటల్లో కొందరు వృద్ధులు హఠాత్తుగా పిచ్చివారై తిరగబడినట్లు పత్రికలలో వచ్చినవార్త జ్ఞాపకమున్న వాళ్ళకు ఈ కథలో నిజానిజాలు ఎలా వున్నా లంబోదర్ చెప్పిన కథ కుతూహలం కలిగించవచ్చు.

ఆంగ్లమూలం : శ్రీ మనోజ్‌దాస్
(సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత)